క్లుప్తంగా

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని కలిగి ఉండాలి



విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా

చివ్వెంల : విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని సూర్యాపేట జిల్లా ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా అన్నారు. సోమవారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీస్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన వార్షిక బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవి భావిపౌరులుగా ఎదగాలని, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి పర్యటనను విజయవంతం చేయాలి

మద్దిరాల : భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ పర్యటనను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని జి.కొత్తపల్లి, పోలుమల్ల, గోరెంట్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట గోపి, యాటల సోమన్న, బలుగురి మధు, జె.నర్సింహారావు, కల్లెపల్లి భాస్కర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఆత్మకూర్(ఎస్) : కోటినాయక్‌తండాలో సోమవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రమావత్ రమేష్ తన గేదెను మేతకు తీసుకువెళ్తుండగా ఎస్సారెస్పీ కాలువకు రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్ వైరు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ దాదాపు రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

నగదు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

తిరుమలగిరి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తిరుమలగిరి మండలం ఈదులపర్రె తండా చెక్ పోస్టు వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓ వ్యక్తి నుంచి రూ.2.47 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్ఎస్‌టీ టీమ్ లీడర్ జాన్ మహ్మద్ తెలిపారు. జనగామ జిల్లా నెల్లుట్ల గ్రామానికి చెందిన బండి మల్లేష్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఎస్‌టీ టీమ్ సభ్యుడు మారయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, మల్లయ్య, నరేష్‌వర్మ, నగేష్ పాల్గొన్నారు.

హనుమాన్ దీక్ష ప్రారంభం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో సోమవారం హనుమాన్ మాలధారుల దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొంత మంది మాలధారణ చేశారు. 41 రోజుల పాటు దీక్షలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలోని భక్త బాలాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు మోత్కూరి ప్రవీణ్‌శర్మ, మాలధారులు చెనబోయిన వీరయ్య, సూరు సైదులు, నిమ్మల రాజు, నిమ్మల నవీన్, నిమ్మల సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రావణి

అర్వపల్లి : ఎండల దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు ఉదయం 11 గంటల లోపు పనులు ముగించుకొని రావాలని అర్వపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణి కోరారు. సోమవారం సీతారాంపురం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండలలో పనులు చేసి వడదెబ్బకు గురికావొద్దని అన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 కూలీ పడుతుందని చెప్పారు. పనుల వద్ద వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.మల్లయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది లింగయ్య, కూలీలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటిశుద్ధి కేంద్రాలు

- నిర్వహణ లేక మూతబడిన వైనం
- పట్టించుకోని అధికారులు



వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో నిరుపయోగంగా మారిన నీటిశుద్ధి కేంద్రం

చివ్వెంల : ప్రజలకు మంచి నీరు అందించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లేక మూతపడి సామగ్రి తుప్పుపట్టిపోతుంది. మిషన్ భగీరథ పథకం రాకముందు గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీలు వీటిని నిర్వహించేవి. కొంత కాలం పాటు గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించారు. కానీ మిషర్ భగీరథ పథకం వచ్చిన తర్వాత ప్లాంట్లు మూతపడ్డాయి. వాటిని పట్టించుకునే నాథుడే లేడు.

వినియోగంలోకి తెస్తే మేలు..

మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్న గ్రామాల్లో పైపులైన్ లీకేజీ సమస్యలు నెలకొన్నాయి. దీంతో ఆ నీటిని తాగటానికి ప్రజలు ఇష్ట పడటం లేదు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించి 20 లీటర్లకు రూ.10 వెచ్చింది తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్లాంట్లు మూతపడటంతో పల్లెల్లో ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు కోకొల్లలుగా ఏర్పడ్డాయి. గతంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇవి పనిచేస్తే 20 లీటర్ల నీరు ఐదు రూపాయలకే అందుతుంది. ఇది పేదలకు ప్రయోజనకరంగా ఉంటుంది. చివ్వెంల మండలంలో చాలా గ్రామాల్లో నీటిశుద్ధి కేంద్రాలు పనిచేయకుండా మూతపడి ఉన్నాయి. అధికారులు వీటిని వినియోగంలోకి తెస్తే తాగునీటి ఇబ్బందులు తీరుతాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

వాటర్ ప్లాంట్లను వినియోగంలోకి తేవాలి

"మూతబడిన వాటర్ ప్లాంట్లను తిరిగి ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్లాంట్ల ద్వారా ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా అందే అవకాశం ఉంది. ప్రస్తుతం తాగునీటిని అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. ప్లాంట్లను పునరుద్ధరిస్తే తక్కువ ధరకు రక్షిత మంచినీరు లభిస్తుంది.

– చెరుకుపల్లి కిరణ్ కుమార్, వట్టిఖమ్మంపహాడ్

నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే..

"మిషన్ భగీరథ పథకం వచ్చిన తర్వాత గ్రామాల్లో వాటర్ ప్లాంట్ల నిర్వహణను వదిలేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. వాటిని బాగు చేయించి వినియోగించుకునే బాధ్యత గ్రామ పంచాయితీలదే. ప్రజలు మిషన్ భగీరథ నీటిని తాగునీటి కోసం వినియోగించుకోవాలి.

– మౌనిక, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

బొడ్రాయి, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



చివ్వెంల : మంగళితండాలో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న జగదీష్ రెడ్డి



పెన్‌పహాడ్ : లింగయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

చివ్వెంల : ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వాల్యతండా ఆవాసం మంగళితండాలో జరిగిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పండుగలు సంప్రదాయాలకు ప్రతీకలు అన్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, బాబు నాయక్, షేక్ దస్తగిరి, పబ్బు సైదులు, రావిచెట్టు సత్యం, మట్టపల్లి లింగయ్య, పబ్బు నాగయ్య, నాగులు మీరా పాల్గొన్నారు.

లింగయ్య మృతికి సంతాపం

పెన్‌పహాడ్ : నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన ఐతబోయిన లింగయ్యగౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహానికి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, ధనియాకుల సత్యనారాయణ, నాగయ్య, వెంకటేశ్వర్లు, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లింగమంతుల స్వామి పండుగ



పస్తాలలో లింగమంతుల స్వామి పండుగకు హాజరై పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

నాగారం : నాగారం మండల పరిధిలోని పస్తాల గ్రామంలో సోమవారం లింగమంతుల స్వామి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉత్సవాలు జరుపుకోవడంతో ప్రజల్లో ఐకమత్యం పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తి అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, లోక్‌సభ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ అభిషేక్‌రెడ్డి, నాయకులు కందుకూరి లక్ష్మయ్య, చిత్తలూరి రమేష్, వడ్లకొండ వెంకన్న, బుక్క శ్రీను, మురళీ, యాదవ భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



మద్దిరాల : ఎంపీపీ గుడ్ల ఉపేంద్రను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



తుంగతుర్తిలో ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కార్యకర్తలు

మద్దిరాల : మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, మోడెం వెంకన్నలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి సోమవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మందుల సామేల్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, తిరుమలగిరి మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, రేట్నేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల పరిధిలోని గానుగుబండ గ్రామ మాజీ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి సోమవారం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే మందుల సామేల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఓరుగంటి సత్యనారాయణ, సుధాకర్, మహేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ధరావతు కుమారి

చివ్వెంల : వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పట్ల ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, ధాన్యం కొనుగోళ్ల వంటి సమస్యలను ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాకవడంతో ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రిష్ణయ్య, ఎంపీఓ సంతోష్ కుమార్, ఏఈ ఆశాకుమారి, ఏపీఎం రాంబాబు, ఏపీఓ నాగయ్య, ఎంపీఓ టి.గోపి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



నూతనకల్‌లో రికార్డులు, ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత



తిరుమలగిరి : గుండెపురిలో రికార్డులను పరిశీలిస్తున్న సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు



అర్వపల్లి : రామన్నగూడెం కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న మండల నోడల్ అధికారి

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులను, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు కోరారు. సోమవారం మండలంలోని గుండెపురి, వెలిశాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు 17 శాతంలోపు తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబోసుకొని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సీరియల్ ప్రకారం కాంటాలు వేయాలని తహసీల్దార్, మండల నోడల అధికారి జక్కర్తి శ్రీనివాసులు నిర్వాహకులకు సూచించారు. సోమవారం రామన్నగూడెంలోని సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డులను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఏఈఓ శోభారాణి, వీఓఏ సరిత, సంఘ బంధం అధ్యక్షురాలు మమత, రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ కలిగిన కార్యకర్త లింగయ్య



లింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మల్లు లక్ష్మి, నాయకులు

పెన్‌పహాడ్ : క్రమ శిక్షణ కలిగిన కార్యకర్త, సీపీఎం పట్ల అచెంచల విశ్వాసం కలిగిన వ్యక్తి ఐతబోయిన లింగయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన లింగయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లింగయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, వీరబోయిన రవి, ధనియాకుల శ్రీనివాస్, నర్సయ్య, నాగరాజు, రాంబాబు, వెంకన్న, సత్యం, పురుషోత్తం, భిక్షం, అభిలాష్, తారమ్మ, లక్ష్మమ్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

తుంగతుర్తి : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ నెల 25న భువనగిరిలో జరిగే కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరా రు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ము ఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుపు కోసం పని చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు కలిసి వచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, దశరథ, శ్రీను, వెంకన్న, రవి, మల్లేష్, వెంకటేష్, సాయికిరణ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జెడ్పీటీసీ



బీజేపీలో చేరుతున్న జెడ్పీటీసీ, తదితరులు

మద్దిరాల : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది బీజేపీలో చేరుతున్నారని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్ రావు అన్నారు. సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలో మద్దిరాల జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెను పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్, మల్లేపాక సాయిబాబ, బొమ్మెర నరేష్, యాకయ్య, మహేష్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ షేక్ కరీముద్దిన్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ అనుములపురి శ్రీనయ్య, ఎంఈఓ నకిరేకంటి రవిలు మాట్లాడారు. కరీముద్దిన్ జూనియర్ అసిస్టెంట్‌గా చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు జమాల్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ వేడుకలు



దురాజ్‌పల్లి : జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆత్మకూర్ (ఎస్) : తుమ్మలపెన్‌పహాడ్‌లో..



తుంగతుర్తిలో..

దురాజ్‌పల్లి : సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావం విప్లవానికి నాంది అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ జయంతి, సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ ఆధ్వర్యంలో విక్రమ్ భవన్ వద్ద అరుణ పతాకాన్ని ఎగురవేసి, అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, పార్టీ డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షుడు రేణుక, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన రమేష్, నాయకులు సయ్యద్, పిడమర్తి లింగయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలోనే పీడిత ప్రజలంతా ఏకతాటిపైకి చేరి భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించారని, వేల ఎకరాల భూములు పేదలకు పంచిపెట్టారని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. సీపీఐ ఎంఎల్ ఆవిర్భావం, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ జయంతి వేడుకలను సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేగల వెంకటక్రిష్ణ, కంచర్ల నర్సక్క, సామ నర్సిరెడ్డి, పోరెండ్ల దశరథ, పగిడి యల్లయ్య, ప్రతాప్, నాగయ్య, మైబెల్లి, చల్లా రవీందర్, వరికుప్పల రాములు, తండు వెంకటయ్య పాల్గొన్నారు.

నాగారం : మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ జయంతి, సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని సోమవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లిలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ దిమ్మె వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి కడారి సైదులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కాత కొమరయ్య, కడారి నాగయ్య, సందీప్, జీడికల్లు పాల్గొన్నారు.

పోరాటాల స్ఫూర్తిని కొనసాగిద్దాం..

తుంగతుర్తి : నక్సల్బరీ, శ్రీకాకుళ గోదావరి లోయల పోరాటల స్ఫూర్తిని కొనిసాగిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేర్పుల లక్ష్మయ్య, కాసర్ల దుర్గయ్య, వేర్పుల కరుణాకర్, బోయిన సోమక్క, బోయిన సత్యక్క, బోయిన నీలమ్మ, బోయిన రాజమ్మ, మున్నా భిక్షమమ్మ, గుండాల నీలమ్మ, వీరబోయిన బుచ్చమ్మ, కొండేటి రమణ పాల్గొన్నారు.

నూతనకల్ : సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు దగ్గుల మల్లయ్య, నూకల అంజయ్య, ముప్పాని సుదర్శన్‌రెడ్డి, వేల్పుల గంగయ్య, పిడమర్తి భరత్, మందడి భూపాల్‌రెడ్డి, కొప్పుల మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రాములు అన్నారు. సోమవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని లింగాల ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడి బయట ఉన్న పిల్లలందరినీ తప్పకుండా బడికి పంపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదర్శన్, గోవిందు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు కాగిత రామచంద్రాపురం పల్లె దవాఖానాలో సోమవారం త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఎస్ఐకి వినతిపత్రం అందిస్తున్న కిశోర బాలికలు

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని ఎంవీఎఫ్ ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాలికలు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి వసతిలేక ఇబ్బందులు అవుతున్నాయని తెలిపారు. మండలంలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐలకు అందించారు. వారికి తెలంగాణ స్టూడెంట్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎఫ్ ఆర్గనైజర్లు నాయిని సైదులు, జయలలిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



అర్వపల్లి : కాసర్లపహాడ్‌లో మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు



పెన్‌పహాడ్ : మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న భవాని కమిటీ సభ్యులు

అర్వపల్లి : కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన కంపసాటి మహేష్ ఇటీవల ఆటో ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ. 10 వేల నగదును పంపించారు. ఆ నగదును సోమవారం మృతుడి కుటుంబీకులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు బొడ్డు రామలింగయ్య యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు కె. వెంకన్న, నాయకులు మెండె సురేష్, మచ్చ సైదులు, వేముల గణేష్, సిరికొండ సత్తయ్య, మచ్చ శ్రీను, జె.గోవర్ధన్, ఆటో యూనియన్ నాయకులు బొబ్బలి యాదగిరి, బి.వీరమల్లు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ధర్మాపురం గ్రామానికి చెందిన పిట్టల వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మృతుడి కుటుంబానికి భవాని కమిటీ సభ్యులందరూ కలిసి రూ. 10వేలు నగదు, 25కేజీల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవాని కమిటీ సభ్యులు తాడూరి లింగయ్య, చెవుగాని అంజయ్య, కుంభం శ్రీను, సాలం పరశురాములు, గుండు లింగయ్య, చెవుగాని సతీష్, నవీన్, అంజయ్య, గణేష్, వెంకన్న, అభి, అజయ్, జానయ్య, నరేష్, వంశీ, కరుణాకర్, అనిల్ పాల్గొన్నారు.